

• రక్త తర్పణం

అసువులు బాసిన అమర వీరులను తలచుకుంటూ ముస్లిం సోదరులు జరుపుకునే మొహర్రం పండుగ బుధవారం జిల్లావ్యాప్తంగా జరిగింది. మచిలీపట్నం, పమిడిముక్కలలో వేలాది మంది ముస్లిం సోదరులు రక్తతర్పణం చేశారు. మజ్జిగ, లస్సీ, పళ్ల రసాలు పంపిణీ చేశారు.

6



అధికారం కోల్పోయినా వైసీపీ శ్రేణుల అరాచకత్వం ఆగలేదు. తెలుగుదేశం పార్టీ నేతలు కనిపిస్తేచాలు వైసీపీ నేతల ఉక్రోషం బయటికొస్తోంది. టీడీపీ సీనియర్ నాయకుడు, మోపిదేవి మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావుపై రాజకీయ కక్షతో వైసీపీ శ్రేణులు గొడ్డలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన మోపిదేవి మండలం బండికోళ్లలంక వద్ద కృష్ణానది కరకట్టపై బుధవారం జరిగింది.



తీవ్రంగా గాయపడిన చందన రంగారావు

గొడ్డలితో వెంటాడి..

టీడీపీ నాయకుడిపై వైసీపీ నేతల హత్యాయత్నం

- రంగారావుపై తండ్రీకొడుకుల దాడి
- ప్రాణాపాయ స్థితిలో బాధితుడు
- చికిత్స కోసం మచిలీపట్నం తరలింపు

మోపిదేవి/అవనిగడ్డ, జూలై 17 : టీడీపీ నాయకుడిపై వైసీపీ శ్రేణులు హత్యాయత్నానికి ఒడిగట్టారు. చల్లపల్లి సీఐ నాగప్రసాద్, ఎస్ఐ వై.సత్యనారాయణ, బాధితుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... మోపిదేవి మండలం కె.కొత్తపాలేనికి చెందిన చందన రంగారావు అనుచరుడు యోగేష్, అదే గ్రామానికి చెందిన మత్తి రాంప్రసాద్ వైసీపీ నాయకుడు. బుధవారం ఉదయం కె.కొత్తపాలెంలోని చెట్టు సెంటర్‌లో యోగేష్, రాంప్రసాద్ గొడవపడ్డారు. యోగేష్‌ను రంగారావు ఉసిగొల్పాడని రాంప్రసాద్ కొడుకు మత్తి శ్రీనివాసరావు భావించాడు. తండ్రీకొడుకులు రంగారావుపై కక్ష పెంచుకున్నారు. బుధవారం కృష్ణానది కరకట్టపై ద్విచక్ర వాహనంపై రంగారావు తన గ్రామానికి వెళుతున్నారు. అదే సమయంలో రాంప్రసాద్, శ్రీనివాసరావు బండికోళ్లలంక వద్ద కృష్ణా నది కరకట్టపై దారికాచి బండికి అడ్డం పడ్డారు.



క్షతగాత్రుడు రంగారావు నుంచి స్టేట్‌మెంట్ తీసుకుంటున్న సీఐ నాగ ప్రసాద్

రంగారావుపై గొడ్డలితో దాడికి పాల్పడ్డారు. తలపై గొడ్డలి వేటు వేశారు. రంగారావు చెయ్యి అడ్డం పెడితే చేతికి గొడ్డలి గాట్లు పడ్డాయి. అంతటితో ఆగకుండా మోకాలిపైగా దాడి చేశారు. తీవ్ర గాయాలతో రంగారావు తప్పించుకునేందుకు కేకలు పెడుతూ పరుగు తీసినా వదలకుండా వెంటపడ్డారు. చుట్టుపక్కల పొలాల్లో ఉండే జనం రావడంతో రాంప్రసాద్, అతని కుమారుడు పరారయ్యారు. తీవ్ర గాయాలై రక్తపు మడుగులో పడి ఉన్న రంగారావును చుట్టుపక్కల వాళ్లు, బంధువులు అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడిని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మోపిదేవి మండల పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వహాక కార్యదర్శి రావి రత్నగిరి పరామర్శించారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న రంగారావును మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం తరలించారు. ఆస్పత్రిలో రంగారావు ఇచ్చిన స్టేట్‌మెంట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ, ఎస్ఐలు తెలిపారు.

తాడంకిలో యువకుడి హత్య

ముసుగుతో వచ్చి తల్లిని బంధించిన దుండగులు



గండిగోట రాంబాబు (ఫైల్)

తాడంకి (పమిడిముక్కల), జూలై 17 : పమిడిముక్కల మండల తాడంకి బీసీ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి గండికోట రాంబాబు (35) హత్యకు గురయ్యారు. తాపీ పనిచేసుకుని జీవనం గడిపే రాంబాబు, అతని తల్లి పద్మ పక్కపక్క ఇళ్లలో నిద్రిస్తున్న తరుణంలో రాత్రి 2 గంటల సమయంలో ముఖానికి ముసుగువేసుకున్న కొందరు దుండగులు పద్మ నోటిలో దుస్తులు కుక్కి కాళ్లుచేతులు కట్టివేశారు. అనంతరం పక్క ఇంట్లో నిద్రిస్తున్న రాంబాబు వద్దకు వెళ్లి తలపై కొట్టి హతమార్చారు. కొద్దిసేపటికి నోటిలో కుక్కిన దుస్తులను తొలగించుకున్న పద్మ కేకలు వేయగా ఇరుగుపొరుగు వారు వచ్చి ఆమె కట్లు విప్పి పక్క ఇంట్లోకి వెళ్లి చూడగా రాంబాబు మంచంపై రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్నాడు. పమిడిముక్కల ఎస్సై శ్రీనివాస్‌కు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకుని సీఐ కిషోర్‌బాబు, గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్‌కు తెలియజేశారు. డీఎస్పీ, సీఐ అక్కడకు చేరుకుని రాంబాబు తల్లి, సోదరుడు, సోదరుడి భార్య, ఇరుగుపొరుగు వారిని విచారించారు. క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించారు. సంఘటనా స్థలం నుంచి అదే రోడ్డులో కొద్ది దూరం వెళ్లిన డాగ్‌స్క్వాడ్ ఆగిపోయింది. రాంబాబు హత్యపై తల్లిని పోలీసులు విచారించగా ముఖానికి ముసుగులు వేసుకుని వచ్చి తన నోటిలో గుడ్డలు కుక్కి కాళ్ల చేతులు కట్టి బంధించారని తెలిపింది. రాంబాబుకు వివాహం కాలేదు.

మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిత్యం నిఘా

- పోలీస్ వ్యవస్థపై నమ్మకం కలిగేలా వ్యవహరిస్తా
- ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన గంగాధరరావు



ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గంగాధరరావు

మచిలీపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, వృద్ధులు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తానని, ఎవరికైనా సమస్యలు ఎదురైతే తనను నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ గంగాధరరావు తెలిపారు. ఎస్పీగా బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించడం, ప్రజాసమస్యలను కాపాడటం, సైబర్ నేరాలను అదుపుచేయడంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తానని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వంటివి జిల్లాలోకి ప్రవేశించకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తానన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమంపైనా దృష్టి సారిస్తానన్నారు. రాజకీయ, విద్యాపరంగా చైతన్యవంతమైన కృష్ణాజిల్లా ఎస్పీగా పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా జిల్లా పోలీస్ విభాగంలో పరిపాలన కొనసాగుతుందన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేస్తానన్నారు. జూలై 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన నూతన చట్టాలకు అనుగుణంగా పరిపాలన కొనసాగిస్తామన్నారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పూర్తిస్థాయి నిఘా ఉంచుతామని, ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తానని తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీని జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలుసుకుని స్వాగతం పలికారు. జిల్లాలో నెలకొన్న పరిస్థితులను పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్ బాలాజీని ఎస్పీ మర్యాదపూర్వకంగా కలుసుకుని జిల్లాలో పరిపాలనలో తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఏలూరు రేంజ్ ఐజీపీ అశోక్‌కుమార్‌ను ఎస్పీ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

• ఉపాధ్యాయుడిగా మొదలై..

ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గంగాధరరావు ఏలూరు జిల్లా తంగెళ్లమూడి గ్రామానికి చెందినవారు. తొలుత ఆయన ఉపాధ్యాయుడిగా పనిచేశారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ, కోయంబత్తూర్ భారతీయార్ యూనివర్సిటీలో ఎంఈడీ చదివారు. స్కూల్ అసిస్టెంట్‌గానూ, జూనియర్ లెక్చరర్‌గానూ కొంతకాలంపాటు పనిచేశారు. ప్రజలకు మరింత చేరువగా ఉండే ఉద్యోగం చేయాలనే ఉద్దేశంతో 2007లో గ్రూప్-1 పరీక్ష రాశారు. అమలాపురం, కామారెడ్డి ప్రాంతాల్లో ఎస్‌డీపీవోగా పనిచేశారు. 2012లో ఏఎస్పీగా పదోన్నతి పొంది నెల్లూరుజిల్లా సీఐడీ విభాగంలో పనిచేశారు. రాజమండ్రిలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాల్లో పనిచేసిన సమయంలో ఎస్పీగా పదోన్నతి పొందారు. ఇంటిలిజెన్స్, ఏసీబీ విభాగాల్లో పనిచేశారు. 2023లో అన్నమయ్య జిల్లా ఎస్పీగానూ, అనంతపురం 14వ బెటాలియన్‌లోనూ పనిచేశారు. సీఐడీ విభాగంలో ఎస్పీగా పనిచేస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో కృష్ణా ఎస్పీగా నియమితులయ్యారు.

జిల్లాలో సాగు పనులు ముమ్మరమయ్యాయి. అన్నదాతల ఆశలు చిగురిస్తున్నాయి. వర్షాలు సంవృద్ధిగా పడటంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. నాలుగైదు రోజులుగా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వర్షం కురుస్తుండటంతో వ్యవసాయ పనులు వేగవంతమయ్యాయి. కంకిపాడు, ఉయ్యూరు, గన్నవరం, తోట్లవల్లూరు, పామర్రు, పమిడిముక్కల, పెదపారుపూడి, ఉంగుటూరు, చల్లపల్లి, మొవ్వ తదితర మండలాల్లో బోరునీటి ఆధారంగా పోసిన నారుమడులు అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంతాల్లో రైతులు వరినాట్లు వేగవంతం చేశారు. వర్షాలు కురవడంతో ప్రకాశం బ్యారేజీ నుంచి సాగునీటి విడుదలను ప్రధాన కాలువలకు తగ్గించినట్టు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. పట్టిసీమ ప్రాజెక్టులో 20 మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 10 మోటార్ల ద్వారా పంపింగ్ చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.



కృత్తివెన్ను మండలం శీతనపల్లి మెగా మంచినీటి చెరువులోకి మోటార్లతో కదులుతున్న నీరు

సాగు ముమ్మరం

వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు

- కాలువ శివారు ప్రాంతాల్లో నారుమడులు పోస్తున్న అన్నదాతలు
- చెరువులను నింపే పనిలో అధికారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : నాలుగు రోజులుగా జిల్లాలో పలుచోట్ల కురిసిన భారీవర్షాల కారణంగా వెదజల్లే పద్ధతిన వరినాట్లు వేసిన పొలాల్లోకి భారీగా వర్షపునీరు చేరడంతో వరిపైరు ముంపుబారిన పడే ప్రమాదం ఏర్పడింది. కొంతమేర వర్షం తగ్గుముఖం పట్టడంతో ముంపుబారి నుంచి పొలాలు బయటపడ్డాయి. నాలుగైదు రోజులుగా ఆశించిన మేర వర్షాలు కురవడం, ఎగువ ప్రాంత రైతులు సాగునీటి వినియోగం తగ్గించడంతో కాలువల ద్వారా సాగునీరు శివారు ప్రాంతాలకు చేరుతోంది. దీంతో కాలువల ద్వారా వచ్చే నీరు, వర్షపు నీటిని ఆధారంగా చేసుకుని కోడూరు, నాగాయలంక, మచిలీపట్నం, పెడన, కృత్తివెన్ను, బంటుమిల్లి తదితర ప్రాంతాల్లో నారుమడులు పోసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

తాగునీటి చెరువుల్లోకి నీరు

ఇప్పటివరకు కాలువలకు నీటి విడుదల ఆలస్యం కావడంతో జిల్లాలోని 266 తాగునీటి చెరువుల్లో నీరు అడుగంటి తాగునీటి ఇబ్బందులు అధికమయ్యాయి. కాలువలకు తాగునీటి కోసం నీటిని విడుదల చేయడం, వర్షం కూడా కురవడంతో తాగునీటి చెరువులను గ్రావిటీ ద్వారా నింపుతున్నారు. కృత్తివెన్ను మండంలోని సీతనపల్లి మెగా మంచినీటి పథకం చెరువులోకి మోటార్ల ద్వారా తాగునీటిని నింపుతున్నారు. మచిలీపట్నం కార్పొరేషన్, పెడన పురపాలక సంఘం, మచిలీపట్నం, గూడూరు మండలాలకు తాగునీటి సరఫరా చేసే తరకటూరు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులోకి ఏడు మోటార్ల ద్వారా నీటిని నింపుతున్నారు. రెండు రోజుల క్రితం వరకు ఈ ట్యాంకులో 1.60 మీటర్ల నీటిమట్టం ఉండగా, బుధవారం నాటికి 2.15 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. మచిలీపట్నం మండలంలోని తుమ్మలచెరువు, వాడపాలెం, కోన, తదితర గ్రామాల్లోని చెరువులకు 9వ నెంబరు కాలువ ద్వారా ఇంకా నీరు చేరలేదు. ఒకటీ, రెండు రోజుల్లో ఈ చెరువులను నింపుతామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు.

కోస్తా తీరం వెంబడి రెండ్రోజులు వర్షాలు

రుతుపవనాలు, అల్పపీడన ద్రోణి ప్రభావంతో రానున్న రెండు రోజులపాటు కోస్తాతీరం వెంబడి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ బుధవారం హెచ్చరికలు జారీ చేసింది. రుతుపవన ద్రోణి సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తున ఆవరించి ఉన్న కారణంతో కోస్తాతీరం వెంబడి రెండు రోజులపాటు భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. నాలుగు రోజులుగా జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈనెల 13వ తేదీన జిల్లా సగటు వర్షపాతం 60.5 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఆరోజు మచిలీపట్నంలో 156 మిల్లీమీటర్ల వర్షపాతం అత్యధికంగా నమోదైంది. 14వ తేదీన జిల్లా సగటు వర్షపాతం 9.5 మిల్లీమీటర్లు, 15వ తేదీన 7.4 మిల్లీమీటర్లు, 16వ తేదీన 36.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని, ఆయన అనుచరుల అక్రమాలు రోజుకొకటి బయటికొస్తున్నాయి. గత ఐదేళ్లలో వారి అరాచకాలకు నలిగిపోయిన బాధితులు ఒక్కొక్కరుగా ముందుకొస్తున్నారు. స్థలాల కబ్జాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా కొడాలి నాని అనుచరుడు రూ.8 కోట్ల విలువైన అక్షర పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకుని, అడ్డొచ్చిన యాజమాన్యాన్ని బెదిరించిన వ్యవహారం వెలుగులోకొచ్చింది. యాజమాన్యం కోర్టును ఆశ్రయించింది.



మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని అనుచరులు ఆక్రమించుకున్న స్థలం

గడ్డం గ్యాంగ్ మరో అరాచకం

పాఠశాల యాజమాన్యాన్ని బెదిరించి స్థలం స్వాహా

- స్థలం విలువ రూ.8 కోట్లుపైనే
- తక్కువ ధరకు కొట్టేసిన గ్యాంగ్
- కోర్టును ఆశ్రయించిన యాజమాన్యం
- పోలీసు విచారణకు కోర్టు ఉత్తర్వులు

గుడివాడ : గుడివాడ టీచర్స్ కాలనీలోని రూ. 8 కోట్ల విలువైన అక్షర పాఠశాల స్థలంపై గడ్డం గ్యాంగ్ కన్నుపడింది. మాజీ మంత్రి కొడాలి నాని మద్దతుతో గడ్డం గ్యాంగ్ సభ్యుడు కొల్లి విజయ్ పాఠశాల యాజమన్యాన్ని బెదిరించి తృణమో ఫలమో చేతిలో పెట్టి సదరు స్థలాన్ని చేజిక్కించుకున్నాడు. ప్రభుత్వం మారడంతో బాధితుల్లో ధైర్యం వచ్చింది. కోర్టును ఆశ్రయించి విచారణకు ఆదేశాలు తెచ్చుకున్నారు. గడ్డం గ్యాంగ్ బాధితులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అండగా నిలుస్తున్నారు. మొన్న బైపాస్ రోడ్డులోని 7.66 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చైతన్య హౌసింగ్ కాలనీ స్థలాన్ని నాని గడ్డం గ్యాంగ్ ఆక్రమించుకోగా, కూటమి అధికారంలోకి వచ్చిన 24 గంటల్లో ప్లాట్ల యజమానులు తమ స్థలాలను స్వాధీనం చేసుకున్నారు. నిన్న పట్టణ నడిబొడ్డులోని శరత్ థియేటర్‌ను కేవలం ఒక్క వాటా ఉన్న కొడాలి నాని పదేళ్లుగా ఆక్రమణలో ఉంచుకుని, ఎవరినీ రానీయకుండా బెదిరింపులకు దిగిన విషయం విదితమే. వీరందరూ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో అధికారులు చర్యలకు దిగారు. ఇదే పంథాలో అక్షర పాఠశాల పాత యాజమన్యం కొట్లాది రూపాయలు విలువ గల తమ స్థలాన్ని చాలా తక్కువ ధరకు బెదిరించి తీసుకున్నారని, తమకు న్యాయం చేయాలని వారు తాజాగా కోర్టును ఆశ్రయించారు. పాఠశాల ఆస్తుల కబ్జాపై విచారణ చేపట్టాలని కోర్టు గుడివాడ వన్‌టౌన్ పోలీసులను ఆదేశించినట్టు బాధితులు తెలిపారు.

పొంచి ఉన్న ముప్పు!

వీఎన్‌పురం కాలనీలో కుళాయిలో డ్రైనేజీ నీరు



- డ్రైయినేజీ గుంతల్లో మంచినీటి పైపులు
- పైపు పగిలిపోవటంతో కలుషితం
- దుర్వాసన, నురుగుతో నీటి సరఫరా
- డయేరియా ప్రబలుతుందేమోనని స్థానికుల భయాందోళన
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

6లో..

తహసీల్దార్ల తహతహ..!

- బదిలీల కోసం ఎక్కడిపనులక్కడే..
- ధ్రువీకరణ పత్రాలు, భూ సంబంధ సమస్యలపై నిర్లక్ష్యం

6లో..

చల్లగా చూడు తల్లీ..

- దుర్గమ్మకు ఆషాఢం సారె సమర్పించిన 1300 మంది

6లో..

కొండచరియలకు త్వరలోనే పరిష్కారం

దుర్గగుడి ఈవో రామారావు



కోనేరుసెంటర్‌లో మాతంలో ముస్లింలు

భక్తి శ్రద్ధలతో మొహర్రం

- వేలాదిగా ముస్లింల రక్త తర్పణం
- కోనేరుసెంటర్‌కు భారీగా తరలి వచ్చిన ప్రజానీకం


మచిలీపట్నం టౌన్, జూలై 17 : కర్బలా మైదానంలో అసువులు బాసిన అమర వీరులను తలచుకుంటూ కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో వేలాది ముస్లింలు రక్తతర్పణం చేశారు. మొహర్రం సందర్భంగా బుధవారం కోనేరుసెంటర్‌లో ముందుగా గిరోహి హుస్సేని పార్టీ ఆధ్వర్యంలో వందలాదిగా చెస్ట్ బీటింగ్ చేశారు. సంప్రదాయ సిద్ధంగా ముస్లిం మహిళలు పల్లకీ మోసుకొచ్చారు. చింతచెట్టు సెంటర్ నుంచి ర్యాలీగా కోనేరుసెంటర్‌కు చేరుకున్నారు. 'యా హుస్సేన్, యా అబ్బాస్' అంటూ చెస్ట్ బీటింగ్ నిర్వహించారు. కర్బలా మైదానంలో మహమ్మద్ ప్రవక్త బోధనలు రక్షించేందుకు పోరాడిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమాన్ని గిరోహి హుస్సేన్ అధ్యక్షుడు ఎం.గులాంహైదర్, ప్రధాన కార్యదర్శి అలందర్ హుస్సేన్, కోశాధికారి ఎం.అబ్బాస్, ఇబ్రహీం బేగ్, అన్వర్, అల్తాఫ్ హుస్సేన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు చెస్ట్ బీటింగ్ చేయడం విశేషం. మహిళలు పాల్గొని



అశ్రునివాళులు అర్పించారు. ఇనాయత్ హుస్సేన్, అల్ హుస్సేని, మీర్ హసన్ అబ్బాస్ అల్ హుస్సేన్ తదితరులు నాయకత్వం వహించారు. చెస్ట్ బీటింగ్‌కు తరలివచ్చిన వేలాది ముస్లింలకు టీడీపీ నేతలు ఎండీ ఇలియాస్ పాషా, గోకుల్ శివ, ఖాజా, గొర్రెపాటి గోపీచంద్, జనసేన నేతలు బండి రామకృష్ణ, గడ్డం రాజు, మాదివాడ రాము తదితరులు సేవలందించారు. చెస్ట్ బీటింగ్‌లో పాల్గొన్న వారికి వైద్యసేవలందించారు. మజ్జిగ, లస్సీ, పళ్ల రసాలు అందజేశారు.

అలీనఖీపాలెంలో..

అలీనఖీపాలెం(పమిడిముక్కల) : అలీనఖీపాలెంలో బుధవారం ముస్లింలు పీర్ల ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హజరత్ ఇమామ్ హుస్సేన్ అషూర్ ఖానా ఆవరణలో యువకులు, పెద్దలు చెస్ట్ బీటింగ్, రక్తతర్పణతో శ్రద్ధాంజలి ఘటించారు. మౌలానా సయ్యద్ షికోహ్ హైదర్ (బిజ్నూర్), కర్బలా అమరవీరుల త్యాగాలను వివరించారు. ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా, సిబ్బంది బందోబస్తు ఏర్పాటుచేశారు.



అలీనఖీపాలెం హుస్సేన్ అషూర్ ఖానా ఆవరణలో..



చల్లగా చూడు తల్లీ..

- దుర్గమ్మకు ఆషాఢం సారె సమర్పించిన 1300 మంది



వన్‌టౌన్, జూలై 17 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు సారె సమర్పణలు అత్యంత భక్తిప్రపత్తులతో కొనసాగాయి. బుధవారం తొలిఏకాదశి, ఆషాఢమాసం ప్రత్యేక రోజు కావడంతో వివిధ ప్రాంతాలనుంచి దుర్గమ్మను దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తజనం తరలివచ్చారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. 1300 మంది అమ్మవారికి సారె సమర్పణల్లో పాల్గొన్నారు. విజయవాడ సీతారాంపురానికి చెందిన బి.సుభాషిత ఆధ్వర్యంలో 200మంది, వైఎస్ఆర్ కాలనీకి చెందిన దాసరి శివనాగమణి ఆధ్వర్యంలో 200 మంది వాగు సెంటర్‌కు చెందిన కోయన్న మాధవరావు ఆధ్వర్యంలో వంద మంది భక్తులు సారె సమర్పించారు. ఆలయంలో రద్దీని పురస్కరించుకుని ఈవో రామారావు ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

ఈనెల 19 నుంచి ప్రారంభం కానున్న శాకంబరీ ఉత్సవాలలో అలంకరణ నిమిత్తం భక్తులు కూరగాయలు తదితరాలను అందజేస్తున్నారు. ప్రత్యేక బుంగ మిర్చిని ఓ భక్తుడు అందచేయగా బుధవారం సాయంత్రం వరకు ఆరున్నర టన్నుల కూరగాయలను భక్తులు సమర్పించారు.



దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

దుర్గమ్మను హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈవో రామారావు వారికి సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.

వద్దిపర్తి పద్మాకర్ ప్రవచనాలు

19, 20తేదీలలో దేవస్థానం ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో వద్దిపర్తి పద్మాకర్ ప్రవచనాలు జరగనున్నాయి. కనకదుర్గమ్మ మహిమలపై ప్రవచనాలు కొనసాగుతాయి.

దుర్గగుడిలో అన్నవితరణకు చెన్నై అడయార్ ప్రాంతం శాస్త్రినగర్‌కు చెందిన ఎం.ఎం.వైద్యనాథన్ దంపతులు బుధవారం రూ.1,08,000 విరాళాన్ని అందించారు.



కీసర స్టాక్ యార్డును పరిశీలిస్తున్న జేసీ సంపత్‌కుమార్

ఇసుక పంపిణీలో అక్రమాలకు తావులేదు

- ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్‌కుమార్

కంచికచర్ల, జూలై 17: ఉచిత ఇసుక పంపిణీలో అక్రమాలు, అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కంచికచర్ల మండలం కీసర స్టాక్ యార్డును బుధవారం ఆయన సందర్శించి ఇసుక పంపిణీ, యార్డులో ఇసుక నిల్వ పరిమాణం గురించి వివరాలు అడిగారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవటమే కాకుండా, ఇసుక పంపిణీ పారదర్శకంగా ఉండాలని చెప్పారు. అవకతవకలు జరగకుండ అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పంపిణీలో నాయకుల జోక్యం లేకుండా చూడాలన్నారు. సెబ్ సీఐ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ నాగుల్ మీరా, ఎస్ఐ సుబ్రహ్మణ్యంతో పాటుగా మైనింగ్, పంచాయతీరాజ్ అధికారులు ఉన్నారు.

కౌలురైతుల సమస్యలు పరిష్కరించండి

- మంత్రి సారథికి సంఘం వినతి




అజిత్‌సింగ్‌నగర్, జూలై 17 : కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం సభ్యులు మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కౌలు రైతుల చట్టాన్ని రద్దు చేసి 2011 భూ అధీకృత రైతుల చట్టాన్ని అమలు చేయాలని కోరారు. గ్రామసభలు నిర్వహించి భూయజమానులతో సంబంధం లేకుండా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు మంజూరుచేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. మంత్రికి వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు, కృష్ణా జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

'గులకరాయి'లో అన్యాయంగా ఇరికించారు

- హోంమంత్రిని కలిసిన నిందితుడు

విజయవాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి కేసులో పోలీసులు అన్యాయంగా తనను ఇరికించారని నిందితుడు వేముల సతీష్‌కుమార్ హోంమంత్రి అనితకు విన్నవించుకున్నాడు. తనకు న్యాయం చేయాలని కోరారు. వెలగపూడిలోని సచివాలయంలో బుధవారం ఆమెను సతీష్ కుటుంబసభ్యులు కలిశారు. ఘటనకు, తమ కుమారుడికి ఎటువంటి సంబంధం లేదని తల్లిదండ్రులు విన్నవించారు. పోలీసులు బెదిరించి నేరాన్ని మోపారన్నారు. న్యాయం చేస్తామని హోంమంత్రి వారికి హామీ ఇచ్చారు.

పొంచి ఉన్న ముప్పు!







- వీఎన్‌పురం కాలనీలో కుళాయిలో డ్రెయినేజీ నీరు!
- డ్రెయిన్ల గుంతల్లో మంచినీటి పైపులు
- పైపు పగిలిపోవటంతో నీరు కలుషితం
- దుర్వాసన, నురుగుతో వస్తున్న నీరు
- డయేరియా ప్రబలుతుందేమోనని స్థానికుల భయాందోళన
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

గన్నవరం, జూలై 17 : జిల్లాలో పలుచోట్ల డయేరియా కేసులు పెరుగుతున్నా.. అధికార యంత్రాంగంలో మార్పు రావటం లేదు. కేసరపల్లి పంచాయతీ పరిధిలోని వెంకటనరసింహాపురం కాలనీలో గత కొద్ది రోజులుగా కుళాయి నుంచి మురుగునీరు వస్తోంది. బుధవారం దుర్గంధభరితంగా, నురుగుతో కూడిన మురుగు నీరు వచ్చింది. రక్షిత మంచినీటిలో డ్రెయినేజీ నీరు కలుస్తోంది. డ్రెయిన్ కాల్వలో మంచినీటి పైపు పగిలి కాలనీ అంతా మురుగు నీరు వస్తోంది. ఈ నీరు తీవ్ర దుర్వాసనతో, నురుగు నల్లటి రంగుతో వుంటోంది. విజయవాడలో డయేరియా కలకలం భయం కలిగిస్తుండగా.. జగ్గయ్యపేటలో ఇటీవల కోరలు చాచింది. వరుస పరిణామాలతో వెంకట నరసింహాపురం ప్రజలు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. కాలనీవాసులు పలుమార్లు పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. మంచినీరు మురికి వాసనతో వస్తోందని చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణనష్టం జరిగే వరకు అధికారులు చర్యలు తీసుకోరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బుధవారం సాయంత్రం హడావిడిగా డ్రెయినేజీ కాలువలో మంచినీటి పైపుకు మూత వేసి వెళ్లారే తప్ప శాశ్వత పరిష్కారం చూపలేదు. మంచినీటి పైపు ఉన్నచెట మురుగునీరు లేకుండా మట్టితో పూడ్చించాల్సిన అవసరం ఉంది. లేకుంటే ఇళ్లల్లోకి మురుగునీరు కుళాయిల్లో వచ్చే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సైడు కాలువలు లేకపోవడంతో చాలా మంది మురుగునీటిని రోడ్డుపక్కన గుంటలు తవ్వి.. అందులోకి మళ్లిస్తున్నారు. ఈ గుంటల కింద మంచినీటి పైపులు ఉంటున్నాయి. పైపులకు లీకులు ఏర్పడటంతో మురుగునీరు తరచూ కుళాయిలలోకి వచ్చేస్తోంది. ఎక్కడ డయేరియా వస్తుందోనని స్థానిక ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా కేసరపల్లి పంచాయతీ అధికారులు రెండో రోడ్డు వెంబడి మంచినీటి పైపుల పక్కన డ్రెయినేజీ గుంటలను పూడ్చివేయాలని, కలుషిత నీరు రాకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

కొండ చరియలకు త్వరలోనే పరిష్కారం

- దుర్గగుడి ఈవో రామారావు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

విజయవాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కొండచరియలు విరిగిపడుతున్న సమస్యను త్వరలో పరిష్కరిస్తామని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఈవో కేఎస్ రామారావు తెలిపారు. ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఘాట్ రోడ్డులో భక్తుల రక్షణార్థం ఇంద్రకీలాద్రి 230 మీటర్ల నుంచి 470 మీటర్ల వరకు రక్షణ కోసం ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలిచామన్నారు. ఈ టెండర్లలో హైదరాబాద్‌కు చెందిన ఎస్ఆర్ కనస్ట్రక్షన్స్ కంపెనీ ఒక్కటే బిడ్ దాఖలు చేసిందన్నారు. ఇందులో జన్యునెస్ డిక్లరేషన్ సర్టిఫికెట్, కీ పర్సనల్ సర్టిఫికెట్లు పొందుపరచకపోవడంతో టెండర్‌ను తిరస్కరించామన్నారు. రెండోసారి నిర్వహించిన టెండర్లలోను ఇదే కంపెనీ బిడ్ దాఖలు చేసి సర్టిఫికెట్లను ఇవ్వలేదన్నారు. ఈ టెండర్‌ను రద్దు చేసి మళ్లీ మూడోసారి టెండర్లను ఆహ్వానించగా ఎస్ఆర్ కనస్ట్రక్షన్ కంపెనీ టెండరు దాఖలు చేసిందని తెలిపారు. పనులు ఆలస్యమవుతున్నందున ఈవిషయాన్ని దేవదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. టెండర్ ఇవాల్యూషన్ కమిటీ సభ్యుడు, ఆర్ అండ్ బీ సీఈలను సంప్రదించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. వారి సూచనల ప్రకారం ప్రైస్ బిడ్‌ను తెరిచామన్నారు. టెండరుదారుడు త్వరలోనే పనులను ప్రారంభిస్తారని వివరించారు.

చందన రంగారావుకు టీడీపీ నేతల పరామర్శ



అవనిగడ్డ, జూలై 17 : మోపిదేవి మండలం బండికోళ్లలంకలో బుధవారం జరిగిన హత్యాయత్నం ఘటనలో తీవ్రంగా గాయపడిన మోపిదేవి మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావును పలువురు టీడీపీ నాయకులు పరామర్శించారు. అవనిగడ్డ మాజీ జడ్పీటీసీ సభ్యులు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ నేత మేడికొండ విజయ్, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర నేత రావి రత్నగిరి, పులిగడ్డ నాంచారయ్య బచ్చు రఘునాథ్, సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, కొమ్ము పవన్ తదితరులు రంగారావును పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే నియోజకవర్గంలో వైసీపీ అరాచకాలు కొనసాగుతున్నాయని, ఎన్నికల తర్వాత కె.కొత్తపాలెంలో మూడు ఘటనలు జరిగినా పోలీసులు స్పందించకపోవటంతో చివరకు హత్య చేసేందుకు కూడా ప్రయత్నించారని ఆరోపించారు. కూటమి విజయం కోసం విశేషంగా కృషి చేసిన రంగారావును అడ్డు తొలగించుకోవాలని వైసీపీ నేతలు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హమాలీస్ వర్కర్స్ యూనియన్ ఎన్నిక



అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు



ప్రధాన కార్యదర్శి దుంపల స్వామి

గుడివాడ, జూలై 17 : ఏఐటీయూసీ అనుబంధ జిల్లా హమాలీస్(ముఠా) వర్కర్స్ యూనియన్ 10వ మహాసభ గూడపాటి ప్రకాష్‌బాబు అధ్యక్షతన సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య ఆధ్వర్యంలో బుధవారం ఏలూరురోడ్డులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దుంపల వెంకటనరసింహారావు, ఉపాధ్యక్షులుగా యు.వేణు, ఆరేపల్లి రామారావు, జిల్లా సహాయ కార్యదర్శులుగా డి.నరసింహారావు, దేవరశ్రీను, గొరిపర్తి శ్రీనివాసరావు, కోశాధికారిగా వెంకన్నలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, పట్టణ ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, ఏఐటీయూసీ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల తహతహ!

- బదిలీల కోసం ఎక్కడి పనులు అక్కడే..
- ధ్రువీకరణ పత్రాలు, భూ సంబంధ సమస్యలపై నిర్లక్ష్యం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రెవెన్యూ శాఖలో బదిలీల గందరగోళం మొదలైంది. ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీ అయిన రెవెన్యూ ఉద్యోగులు తిరిగి సొంత జిల్లాలకు రాకపోవటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. బదిలీలపై స్పష్టత లేకపోవటం వల్ల పాలన అస్తవ్యస్తంగా మారింది. త్వరలో వెళ్లిపోతామన్న ఉద్దేశంతో పనిపై దృష్టి తగ్గింది. ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు ఇక్కడి నుంచి ఎప్పుడు వెళ్లిపోతామా అని ఎదురుచూస్తున్నారు. వీరిలో ఒకరిద్దరు తహసీల్దార్లు మాత్రం ఇక్కడి నుంచి కదలటానికి ఇష్టపడట్లేదు. మెజారిటీ తహసీల్దార్లు మాత్రం వెళ్లిపోయేందుకే తహతహలాడుతున్నారు. దీంతో రెవెన్యూ సంబంధ పనులు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది.

అన్నీ సమస్యలే..

ప్రస్తుతం విద్యాసంవత్సరం ప్రారంభమైంది. విద్యార్థులకు కుల, ఆదాయ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ తదితర సర్టిఫికెట్లు అవసరమవుతున్నాయి. ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు వీటిపై సంతకాలు చేయట్లేదు. ఇక భూ సంబంధిత సమస్యలపై వచ్చేవారికి కూడా నిరాశే ఎదురవుతోంది. చాలామంది తహసీల్దార్లు ప్రజలకు అందుబాటులో ఉండట్లేదు. దీంతో చాలా లావాదేవీలు పెండింగ్‌లో పడ్డాయి. రెండు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది.

బదిలీలు జరిగేనా..?

కాగా, బదిలీలు ఇప్పట్లో ఉండవన్న ప్రచారం నడుస్తోంది. వైసీపీ ప్రభుత్వంతో అంటకాగి పనిచేశారన్న కారణంగా తహసీల్దార్లు, కొందరు జిల్లా అధికారులను కొంత కాలం బదిలీ చేయకూడదని ప్రభుత్వం భావిస్తున్నట్టుగా ప్రచారం నడుస్తోంది. ఇందులో వాస్తవం లేదనే చర్చ కూడా జరుగుతోంది.

సాగునీరు విడుదల

వీరులపాడు, జూలై 17: నందిగామ మండలం రాఘవాపురం-కమ్మవారిపాలెంలో శ్రీసీతారామ ఎత్తిపోతల పథకం పంపింగ్ స్కీమ్‌లో మోటార్ ఆన్ చేసి సాగునీటిని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైసీపీ అసమర్థ పాలన వల్ల ఎత్తిపోతల పథకాలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయన్నారు. సాగునీటి విడుదలతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రైతు సమస్యలు పరిష్కరించండి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి

గుడివాడ, జూలై 17 : రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18, 19తేదీల్లో సచివాయాలు, ఆర్‌బీకేల్లో వినతిపత్రాలను అందజేయనున్నట్టు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఏడాది వచ్చిన తుఫాన్ నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీలను కొంతమంది రైతులకు మాత్రమే యిచ్చారన్నారు. వ్యవసాయ విద్యుత్ మీటర్లు బిగించడానికి గత ప్రభుత్వం జీవో నెం.22ను తీసుకువచ్చిందని, మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. పెట్టుబడి సహాయంగా యిస్తానన్న రూ.20వేలను వెంటనే అందించాలన్నారు. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈ నెల 18, 19 తేదీల్లో చేపట్టిన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గౌరిశెట్టి కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు నీలం మురళీ కృష్ణారెడ్డి, ఎన్.వి కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బొర్రగూడెంలో షూటింగ్ ప్రారంభిస్తున్న అక్కల గాంధీ

మైలవరంలో 'డాక్టర్ విశ్వామిత్ర' షూటింగ్

మైలవరంరూరల్, జూలై 17 : మండలంలోని బొర్రగూడెం తిరుపతమ్మ గోపయ్య స్వామివార్ల దేవస్థానంలో 'డాక్టర్ విశ్వామిత్ర' సినిమా షూటింగ్‌ను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు(గాంధీ) క్లాప్ కొట్టి బుధవారం ప్రారంభించారు. శివసాయి బాలాజీ మూవీ మేకర్స్ పతాకంపై సాయి వెంకట్ దర్శకత్వం వహిస్తుండగా, శివరామ్ హీరోగా, సౌమ్య, వీరంకి వెంకట నరసింహారావు, రామకృష్ణ, రంగనాయకులు, బాలచందర్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, 'డాక్టర్ విశ్వామిత్ర షూటింగ్ విజయవంతం పూర్తిచేసుకొని, సినిమా సైతం హిట్ కావాలని ఆకాంక్షించారు. మైలవరం ప్రాంతంలో సినిమా షూటింగ్‌లతో స్థానికులకు కూడా అవకాశాలు కలుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు బొలియాశెట్టి శ్రీకాంత్, మైలవరం, రెడ్డిగూడెం మండలాల అధ్యక్షులు శీలం బ్రహ్మయ్య చాపలమడుగు కాంతారావు, పాములపాటి సుందరరామిరెడ్డి, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌పై పోలీసుల దాడి

ఇబ్రహీంపట్నం, జూలై 17: జూపూడి శివారులో ఉన్న శ్రీలక్ష్మి మౌర్య దాబా రెస్టారెంట్‌లో అనధికారంగా బార్ నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం దాడులు చేశారు. రెండు రోజులుగా పోలీసులు హెచ్చరిస్తున్నా యాజమాన్యం పెడచెవిన పెట్టింది. దీంతో పోలీసులు దాడి చేసి మందు బాబులను, నిర్వహణ సిబ్బందిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

లెక్క తేల్చే పనుల్లో.. రెవెన్యూ అధికారులు

- 'ఎన్నికల విధుల్లో పనిచేసిన సిబ్బందికి పారితోషికాలెప్పుడు' కథనంతో కదలిక
- సెలవు రోజు వచ్చి తలమునకలు
- బీఎల్‌ఓలలో సంతోషం.. డీటీలకు అందని పారితోషికం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

జగ్గయ్యపేట, జూలై 17 : ఎన్నికల విధుల్లో పనిచేసిన సిబ్బందికి పారితోషికాలెప్పుడు? కథనం రెవెన్యూ వర్గాలతో పాటు, బీఎల్‌ఓలుగా పనిచేసిన వివిధ శాఖల సిబ్బందిలో చర్చనీయాంశమైంది. ఉన్నతాధికారులును గట్టిగా అడగలేని నిస్సహాయతను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవటంతో వారంతా సంతోషం వ్యక్తం చేశారు. ఇక రెవెన్యూ ఉన్నతాధికారుల్లో కదలిక తెచ్చింది. బుధవారం మొహర్రం సందర్భంగా కార్యాలయానికి సెలవు ఉన్నా అధికారులు వచ్చి లెక్కలు తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. ఉదయం నుంచి ఎన్నికల వ్యయం లెక్కల్లో పడి పోయారు. బీఎల్‌ఓలతో పాటు నియోజకవర్గంలో, వివిధ మండలాల నుంచి ఎన్నికల విధులకు హాజరైన డిప్యూటీ తహసీల్దార్‌లకు పారితోషికం అందలేదని ఇప్పుడు బయటపడ్డారు. వివిధ హోదాల్లో పనిచేసిన అధికారులకు కూడా ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తం అందలేదని వాళ్లు అసంతృప్తి వెలిబుచ్చుతున్నారు. ఎన్నికల కోసం వచ్చిన బడ్జెట్ ఎంత.. వ్యయం ఎంత.. బిల్లులు ఇచ్చింది ఎంత.. ఎవరెవరికి ఎంత ఇచ్చారనేది తేల్చాల్సి ఉంది. ఎన్నికల సందర్భంగా సేవలు అందించిన ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వాల్సిన బిల్లులపై కూడా లెక్కలు తేలాల్సి ఉంది. ఇవన్నీ తేలితేనే ఎన్నికల వ్యయంలో అవకతవకలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

డయేరియా లక్షణాలతో వృద్ధుడు మృతి!



వత్సవాయి, జూలై 17 : డయేరియా లక్షణాలతో వృద్ధుడు మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. మృతుడి బంధువుల సమాచారం మేరకు.. పాత వేమవరం గ్రామానికి చెందిన బిల్లా వెంకటేశ్వర్లు (70) మంగళవారం ఉదయం నుంచి వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం వత్సవాయి పీహెచ్‌సీలో చేర్పించారు. చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు రాత్రి మృతి చెందాడు. భార్య మూడేళ్ల క్రింత చనిపోయింది. రోగి ఆసుపత్రికి వచ్చిన తర్వాత వాంతులు, విరేచనాలు కాలేదని, అనారోగ్యంతో పాటు గుండెపోటు వల్లే అతడు మృతిచెందినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుష్మ తెలిపారు. ఇదిలా ఉంటే.. గ్రామంలో సీసీ రోడ్లు ఉన్నా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. వెంకటేశ్వర్లు మృతితో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ సిబ్బంది స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పర్చాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారికి తీవ్రగాయాలు

బంటుమిల్లి, జూలై 17 : పెదతుమ్మిడిలో వైవాక రోడ్డుపై ఆడుకుంటున్న చిన్నారిని బుధవారం కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. బంటుమిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సొట్టి నరసింహారావు కుమార్తె నాగలక్ష్మి(5)ని గుడివాడ నుంచి వైవాక వెళుతున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యుల సూచనలతో మెరుగైన వైద్య కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాగలక్ష్మి అక్కడ చికిత్స పొందుతోంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	113, 121, 132
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

నూతన ఎస్పీని కలిసిన జంక్షన్ సీఐ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 17 : జిల్లా నూతన ఎస్పీగా ఆర్. గంగాధరరావు, బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. మచిలీపట్నంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో హనుమాన్ జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, రహదారి భద్రతా చర్యల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించినట్లు సీఐ నరసింహమూర్తి తెలిపారు.



ఘనంగా మొహర్రం ర్యాలీ

హనుమాన్‌జంక్షన్, జూలై 17: మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ చేసిన బలిదానం గుర్తు చేసుకోవడమే మొహర్రం పర్వదినం ప్రత్యేకత అని స్థానిక కెఎస్ టాకీస్ రోడ్డులోని ముస్లిం మత గురువు కిల్లీ బాబా అన్నారు. బుధవారం మొహర్రం సందర్భంగా కిల్లీ బాబా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. బాబా నివాసం నుంచి గుర్రాలతో జెండాలను ప్రదర్శించారు. బాబా ఇంటి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బాబా అభివాదం చేస్తూ ప్రజలకు మొహర్రం శుభాకాంక్షలు తెలియజేశారు.



కిల్లీబాబు ఆధ్వర్యంలో జంక్షన్‌లో ప్రదర్శన

కనకదుర్గమ్మ శాకంబరి
ఉత్సవానికి కూరగాయలు



కూరగాయలు తీసుకువెళ్తున్న వాహనానికి జెండా ఊపి ప్రారంభిస్తున్న చినఓగిరాల రైతులు

చినఓగిరాల(ఉయ్యూరు), జూలై 17 : ఆషాడమాసం పురస్కరించుకుని విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు అమ్మవారికి జరిగే శాకంబరి ఉత్సవానికి రూ. 55వేల విలువ చేసే మూడున్నర టన్నుల కూరగాయలు బుధవారం చినఓగిరాల నుంచి పంపించారు. మరీదు శివశంకరరావు, దోనేపూడి శివాజీ, దోనేపూడి వెంకటేశ్వరరావు, బొమ్మారెడ్డి వెంకటరెడ్డి, దాతలు, రైతుల ఆధ్వర్యంలో అమ్మవారి శాకంబరి ఉత్సవానికి అవసరమైన కూరగాయలు అందజేశారు. కూరగాయల తీసుకు వెళ్లే వాహనానికి శివశంకర్, శివాజీ జెండా ఊపి ప్రారంభించారు.

సేవలు విస్తృతం చేయాలి

లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వన్నాల

కంకిపాడు, జూలై 17 : లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృత పరచాల్సిన అవసరముందని కంకిపాడు లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులు వన్నాల శివరామకృష్ణ అన్నారు. స్థానిక రాయల్స్ ఏసీ కళ్యాణ మండపంలో బుధవారం లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ సేవలను పేదలకు మరింత చేరువ చేయాల్సిన అవసరముందన్నారు. లయన్ వేములపల్లి లక్ష్మణ చౌదరి క్లబ్ సేవలకు వినియోగించేందుకు అవసరమైన రూ. లక్ష విరాళాన్ని క్లబ్ అధ్యక్షులకు అందజేశారు. అనంత రం నూతన కార్యవర్గం అధ్యక్షులుగా శివరామకృష్ణ, కార్యదర్శిగా మద్దుల యుగంధర్, కోశాధికారిగా నల్లజేరు నిహార్ ఏకగ్రీవంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో డి. శ్రీశాంతి, పూర్వ గవర్నర్లు శివశంకర్, మిరియాల వెంకటేశ్వరరావు, బండి జ్యోతి, నాంచారయ్య, రాచూరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అరటితో విలువైన ఉత్పత్తులు

గన్నవరం, జూలై 17 : అరటిపండు, కాయ, నార, ఆకులు ఇలా అరటికి సంబంధించిన అన్ని పదార్థాలను విలువ జోడించే ఉత్పత్తులు అని ఏఎల్‌ఈఏపీ చైర్‌పర్సన్ కె. కనకదుర్గ అన్నారు. అరటి నార, ఆహార ఉత్పత్తులపై వారం రోజుల పాటు ఏఎల్‌ఈఏపీ సూరంపల్లి మహిళా పారిశ్రామికవాడలో జరుగుతున్న శిక్షణ కార్యక్ర మాలు బుధవారంతో ముగిసాయి. శిక్షణ పొందిన 37మంది మహిళలకు ధ్రు వీకరణ పత్రాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ వి. సునీత తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో మడిచర్ల కోదండరామస్వామి



వేంకటేశ్వరస్వామికి నిర్వహిస్తున్న పాలాభిషేకం తిలకిస్తున్న భక్తులు



ఆత్కూరు ఆలయంలో అమ్మవారికి ఆషాఢ సారె సమర్పిస్తున్న గ్రామస్థులు

సర్వశ్రేష్ఠం.. తొలి ఏకాదశి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పెద్ద ఎత్తున ఆషాఢ సారె సమర్పణ
- పోటెత్తిన భక్తులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 17 : శివ కేశవులకు ప్రీతికరమైన రోజు... వ్రతాలు, పండు గలు ప్రారంభమయ్యే రోజు తొలి ఏకాదశి సర్వ శ్రేష్టమైనదిగా భావిస్తూ వైష్ణవాలయాలను ప్రత్యేక అలంకరణతో పూజలు నిర్వహిస్తారని కానుమోలు అర్చకులు రాము తెలిపారు. ఆరుగొలను, వేలేరు, కానుమోలు, తదితర గ్రామాల్లో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. మడిచర్లలోని శ్రీకోదండరామాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆవరణ మొత్తం వివిధ రకాల ఫలాలతో అలంకరణ చేసి స్వామి వారికి పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. కానుమోలులోని పురాతన సీతారామాలయంలో అర్చకులు రాము పర్యవేక్షణలో ప్రత్యేక అభిషేక పూ జలు, పారాయణం నిర్వహించారు. కాకులపాడు శ్రీకోదండ రామాలయంలో మేళతాళాల మధ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయలో

హనుమాన్‌జంక్షన్:స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయలో తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి 108 లీటర్ల పాలతో అభిషేకం జరిపారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ట్రస్టీ కాకాని బాబు, తవ్వా పూర్ణ చంద్రరావు, ఈవో కె.శ్రీనివాస్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ట్రస్టీ కాకాని అరుణ, గ్రామ ప్రముఖులు సుంకర సుభాష్ చంద్రబోస్, నందిగం స్వామి, కేతినీడి తేజోమూర్తి, చింతా రాఘవరావు, కనిగంటి రంగారావు, వెనిగళ్ల వెంకటరంగారావు పాల్గొన్నారు.



వీరమ్మకు ఆషాఢ సారె సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

వీరమ్మకు ఆషాఢ సారె

ఉయ్యూరు : ఆషాడమాసం తొలిఏకాదశి పురస్కరించుకుని వీరమ్మ అమ్మవారికి బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆషాఢ సారె సమర్పించారు. ప్రధాన రహదారిపై ఉన్న అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మేళతాళాలు, డప్పువాయిద్యాలు, జైవీరమ్మ నినాదాలతో సందడిగా బయలుదేరి రావిచెట్టు సెంటర్‌లో ఉన్న అమ్మవారి మెట్టినింటికి చేరుకున్నారు. పసుపు కుంకుమ, చీర సారె సమర్పించి పూజలు చేశారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అమ్మవారి పూజలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి సాదర స్వాగతం పలికి అమ్మవారి శేషవస్త్రాలు అందజేశారు. పారుపూడి వంశస్తుల ఆడపడుచులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

ఉంగుటూరు : తెలుగువారి తొలి పండుగగా హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత వున్న ఆషాఢ శుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి)ని బుధవారం మండల వ్యాప్తంగా భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తొలి ఏకాదశి (శయన ఏకాదశి) శ్రీమహావిష్ణువు అత్యంత ప్రీతికరమైన రోజు కావడంతో లక్ష్మీనారాయణుల దర్శనానికై ఆయా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా మండలంలోని పలు వైష్ణవ ఆలయాలు విష్ణుసహస్రనామ పారాయణం, గోవింద నామస్మరణతో మార్మోగాయి.

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె

ఆషాఢమాసం సందర్భంగా ఆత్కూరు గ్రామస్థులు తమ గ్రామంలో జాతీయరహదారి పక్కన కొలువైయున్న శ్రీకనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారికి బుధవారం ఆషాడమాస సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఆలయ కమిటీ పెద్దలు ప్రసాద్ ఆధ్వర్యంలో తొలుత స్థానిక గంగానమ్మ గుడివద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరంపట్టుచీరెలు, పసుపు, కుంకుమలు, గాజులు, పూలు,పండ్లు వివిధరకాల పిండివంటలు, పొంగళ్లు, చలిమిడి బిందెల కావిళ్ల వెంటరాగా, మేళతాళాలతో గ్రామంలో అమ్మవారి సారె ఊరేగింపు ఉత్సవం జరిపారు. అక్కడ కనకదుర్గమ్మకి శాస్త్రోక్తంగా పూజలు జరిపి, తెచ్చిన సారెను అమ్మవారికి సంప్రదాయబద్ధంగా సమర్పించారు.

నున్న108కు సుస్తి

- మరమ్మతులకు నోచుకోక రెండు నెలలుగా షెడ్‌లోనే



మూలనపడిన 108 వాహనం

విజయవాడ రూరల్, జూలై 17 : ప్రజలకు అత్యవసర సేవలు అందించాల్సిన నున్న 108 మూలనపడింది. రెండు నెలలుగా మరమ్మతులకు నోచుకోక అత్యవసర సేవలకు దూరమైంది. దీంతో స్థానిక ప్రజలకు అత్యవసర సేవలు అందే పరిస్థితి లేకుండా పోయింది. 2016లో నున్న గ్రామంలో అప్పటి ప్రభుత్వం 108 సేవలను ఏర్పాటు చేసింది. నున్న గ్రామ సమీపంలోని అడవినెక్కలం, నున్న, పాతపాడు, మంగళాపురంలతో పాటు పాయకాపురం, అజిత్‌సింగ్ నగర్ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండేది. స్థానికంగా రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు, పేద ప్రజలు అనారోగ్యాల భారిన పడినప్పుడు 108 సేవలను వినియోగించుకునే వారు. అయితే గత రెండు నెలలుగా నున్న గ్రామంలోని 108 మూలనపడటంతో ప్రజలకు అత్యవసర సేవలు అందే పరిస్థితి కనిపించడం లేదు. 108 మూలపడటంతో నలుగురు సిబ్బందికి అధికారులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విధుల నిమిత్తం పంపించి వేసి 108ను పక్కన పెట్టేశారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

హోంమంత్రి అనితకు తెలుగు యువత నేత గండేపూడి వినతి



హోంమంత్రికి అక్రమ కేసుల విషయాన్ని వివరిస్తున్న నితీష్‌కుమార్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 17 : గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయ కులు, తెలుగు యువతపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని హోం మంత్రి వంగలపూడి అనితకు జిల్లా తెలుగుయువత అధికార ప్రతనిధి గండేపూడి నితీష్ కుమార్ వినతిపత్రం అందజేశారు. బాపులపాడు మండలం బొమ్ములూరుకు చెందిన నితీష్ బుధవారం గన్నవరం విమానాశ్రయంలో హోం మంత్రి అనితను కలిసి అక్రమ కేసుల వివరాలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. యువతపై అక్రమకేసులు పెట్టడం వల్ల యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో ఉపాధి అవకాశాలు మెరుగవుతున్న తరుణంలో యువత భవష్యత్తుపై కేసుల ప్రభావం పడుతుందని హోం మంత్రికి వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సమీక్షించి తగుచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నితీష్‌కుమార్ తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

జనసేన నాయకులు

పెనమలూరు, జూలై 17 : జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు జనసేన నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, నియోజకవర్గ బాధ్యులు ముప్పారాజా, తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు తాతపూడి గణేష్‌లు పిలుపునిచ్చారు. బుధవారం తాడిగడప మునిసిపాలిటీ జనసేన కార్యాలయంలో అధ్యక్షుడు తాతపూడి గణేష్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తలు, నాయకుల శిక్షణ, సమీక్ష సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మునిసిపాలిటీ పరిధిలోని 38 డివిజన్లకు అధ్యక్షులను నియమించి నియామకపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఉన్న జనసేన పార్టీ మిత్ర పార్టీలతో మైత్రిగా ఉంటూనే సమాజంలోని పేద ప్రజలకు ప్రభుత్వాన్ని దగ్గరకు తీసుకువచ్చి వారి అవసరాలు తీరుస్తూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే ప్రతినిధులుగా అందరూ సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దానికోసం తరచుగా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని ఓటు బ్యాంకులో సగం ఓట్లు తాడిగడపలోనే ఉన్నాయని, త్వరలో మునిసిపాలిటీలో అత్యంత శక్తివంతమైన పార్టీగా జనసేన అవతరించనున్నదని పేర్కొన్నారు. జనసేన పార్టీ బలోపేతానికి నిరంతరం పాటుపడుతున్న అధ్యక్షుడు గణేష్‌ను బండ్రెడ్డి అభినందించారు. సమావేశానికి వచ్చిన బండ్రెడ్డి రామకృష్ణకు, ముప్పా రాజాకు గణేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి కాకాని లోకేష్, స్థానిక నాయకులు గోళ్ల శ్రీనివాస్, చెన్నా గాంధీ, వంగూరు మురళి, సమ్మెట సుధాకర్, తిరుమలశెట్టి సుధీర్, వడ్డీ జీవ, మాదాసు రాము, నవీన్, ఎండీ రఫీ, రిజ్వాన్, నాగమ్మ, తిరుపతమ్మ, సుభాషిణి, బొగ్గవరపు నాగేంద్ర, సేలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



డివిజన్ అధ్యక్షులకు నియామకపత్రాలు అందజేస్తున్న జనసేన నాయకులు

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

హనుమాన్‌జంక్షన్, జూలై 17: అప్పులు బాధ తాళలేక మనస్థాపంతో స్థానిక హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన కర్నాటి శ్రీనివాసరావు (40) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు భార్యతో మనస్పర్ధలు వచ్చి రెండేళ్లుగా ఒంటరిగా ఉంటున్నాడు. దీంతో పాటు అవసరాలకు చేసిన అప్పులు తీరక పోవడంతో మనస్థాపం చెంది ఇంట్లోనే స్లాబ్ రింగుకు తువాలుతో ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి చేయండి

● దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సంధ్యతో మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, జూలై 17: దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని దేవదాయశాఖ కృష్ణాజిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎన్.సంధ్యకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సంధ్య అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. బుద్ధప్రసాద్‌తో దేవాలయాల అభివృద్ధిపై చర్చించారు. దేవదాయశాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ఈవో యార్లగడ్డ శ్రీనివాసు, సీహెచ్ సుధాకర్, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



బుద్ధప్రసాద్‌కు పూలమొక్క అందజేస్తున్న సంధ్య



చిలకలపూడి పాండురంగస్వామి దేవాలయంలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ





అవనిగడ్డలో ప్రత్యేకాలంకరణలో లక్ష్మీనారాయణస్వామి, ఉల్లిపాలెంలో శ్రీమన్నారాయణుడి మూలవిరాట్‌కు అష్టోత్తర శతకలశ అభిషేకం చేస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

కిటకిటలాడిన ఆలయాలు ● స్వామివార్లకు ప్రత్యేక పూజలు

మచిలీపట్నం టౌన్, జూలై 17: తొలి ఏకాదశి సందర్భంగా నగరంలోని ప్రధాన విష్ణాలయంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక అర్చనలు చేశారు. బచ్చుపేట వేంకటేశ్వరస్వామి ఆలయం, హయగ్రీవస్వామి దేవాలయం, కోదండ రామాలయం, చల్లరస్తా సెంటర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయం, గొడుగుపేట వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో అర్చనలు నిర్వహించారు. భగవద్గీత పారాయణ చేశారు. ఆలయాలు కిటకిటలాడాయి.





పులిగడ్డలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి, చిలకలపూడి పాండురంగస్వామి దేవాలయంలో బారులు తీరిన భక్తులు

కోడూరు: ఉల్లిపాలెంలో రాజ్యలక్ష్మి గోదా సమేత శ్రీమన్నారాయణస్వామి ఆలయంలో మూలమూర్తులకు అష్టోత్తర శతకలశ స్నపన తిరుమంజన సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. సాయంత్రం స్వామి తిరు కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఏర్పాట్లను అష్టాక్షరి సంపత్‌కుమార్ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షించారు.

అవనిగడ్డ రూరల్: పులిగడ్డ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేకనూరులోని సంతాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అవనిగడ్డ: లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామికి విశేష అభిషేకాలు, చందన అలంకారం చేశారు. పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ధర్మకర్త పోతరాజు గోపాలకృష్ణమూర్తి-కృష్ణకుమారి దంపతులు విశేష పూజలు చేశారు. స్వామి చందనోత్సవ అలంకారంలో దర్శనమిచ్చారు. స్వామికి ఊంజల్ సేవ నిర్వహించారు. లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో సామూహిక సత్యవ్రతాలు నిర్వహించారు. 50 మంది భక్తులు పాల్గొన్నారు.

పామర్రు: విష్ణాలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేకాలంకరణలో ఉన్న వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు.

పెదపారుపూడి: వెంట్రప్రగడలో భ్రమరాంబ సమేత నామేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు పూజలు చేశారు. అర్చకులు స్వామికి అభిషేకాలు, సహస్రనామార్చనలు చేశారు.

గుడివాడ: పట్టణంలోని వైష్ణవ ఆలయాలు కిటకిటలాడాయి. వేలాదిగా భక్తులు దేవాలయాలకు వచ్చి పూజలు చేశారు. జగన్నాథపురంలో శ్రీభూనీలా సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారుజాము నుంచి స్వామికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

చల్లపల్లి: గరుడ ఆంజనేయ సహిత వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంగళాపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నిమ్మలతోటలోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి క్షేత్రంలో అయ్యప్పస్వామిని మాధవపూజ సహితంగా విఠలునిగా అలంకరణ చేశారు. ఉపాలయంలో విష్ణుమూర్తిని విశేషంగా అలంకరించారు.



నాగాయలంకలో కనకదుర్గమ్మకు ఆషాఢసారె సమర్పిస్తున్న మహిళలు

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె

నాగాయలంక: తొలి ఏకాదశిని పురస్కరించుకుని గ్రామస్తులు బుధవారం కనకదుర్గమ్మకు ఆషాఢసారెను సమర్పించారు. పోతురాజుస్వామి ఆలయం నుంచి మేళతాళాలతో సారెను ఊరేగింపుగా తెచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మత్తి రామచంద్రరావు ఆర్థిక సహకారంతో 500 మందికి అన్నసమారాధన చేశారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, మండవ, తలశిల, సబ్బినేని ఆలయ వంశీకులు పాల్గొన్నారు. ఉప్పల లీలా కృష్ణప్రసాద్, బోయపాటి రాము, మండవ బుజ్జి పర్యవేక్షించారు.

గంగానమ్మకు బోనాలు

తోట్లవల్లూరు: ఆషాఢమాసం సందర్భంగా వల్లూరుపాలెంలో యార్లగడ్డ ఏసుబాబు, పద్మశ్రీ దంపతుల ఆధ్వర్యంలో గంగానమ్మ తల్లికి బుధవారం బోనాలు, సారె సమర్పణలు, ప్రత్యేకపూజలు వైభవంగా జరిగాయి. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.





కాజ, ఐలూరులో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

త్యాగానికి ప్రతీక మొహర్రం





కవుతరంలో పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు, మచిలీపట్నం కోనేరు సెంటర్‌లో టీడీపీ, జనసేన నాయకులు

గుడివాడ: మొహ్రరం త్యాగానికి, స్ఫూర్తికి ప్రతీక అని ముజావర్ సయ్యద్ ఆరీఫ్ అన్నారు. విశ్వాసం, నమ్మకం కోసం మహ్మమద్ ప్రవక్త మనుమడు హజరత్ ఇమామ్ హుసేన్ చేసిన బలిదానాన్ని గుర్తు చేసుకోవడమే మొహ్రరం ప్రత్యేకత అని, రక్తతర్పణం చేయడం మానవజాతి త్యాగమని, త్యాగాన్ని గుర్తు చేసుకోవడమే మొహర్రం ప్రత్యేకత అని ఆయన అన్నారు. మొహర్రంను పురస్కరించుకుని ముస్లింలు బుధవారం పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ముజావర్ సయ్యద్ ఆరీఫ్ సందేశమిచ్చారు. నాజీమున్నీసా, ఖాసీం, అహమ్మద్ బేగ్, అబ్దుల్ అలీమ్, షేక్ నవాబ్, జానీ పాల్గొన్నారు.

కర్బలా వీరుల త్యాగం మరచిపోలేనిది

మచిలీపట్నం టౌన్: ఇస్లాం మత పరిరక్షణకు కర్బలాలో అమరవీరులు చేసిన త్యాగాలు మరచిపోలేమని వైజ్ మెన్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ పీర్ అన్నారు. అజ్మీర్‌బాబా సేవా సమాజం ఆధ్వర్యంలో బుధవారం మొహర్రం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హజ్రత్ ఇమామ్ హుస్సేన్ జెండాకు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. డాక్టర్ నాగలింగం నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఇమాం హుస్సేన్‌తో పాటు 71 మంది కుటుంబ సభ్యులు, అనుచరులు మూడు రోజుల పాటు ఆకలి దప్పులతో ఆత్మబలిదానం చేశారన్నారు. 1400 ఏళ్ల క్రితం జరిగిన ఈ దుర్ఘటన ప్రపంచంలోని ముస్లింల హృదయాలు కదల్చివేసిందన్నారు.

కూచిపూడి: మొహ్రరం సందర్భంగా బుధవారం ముస్లింలు పీర్లను ఊరేగించి నివాళులర్పించారు. మొవ్వ మండలంలో కాజ, భట్లపెనుమర్రు, నిడుమోలులోని మసీదుల వద్ద కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాజ గ్రామంలోని వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ సయ్యద్ మతిన్, పెద్దలు షేక్ ఇస్మాయిల్, షేక్ ఇబ్రహీం, ఎండి.బహదూర్ ఆలీ, అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: కవుతరం, డోకిపర్రు, పెంజంద్ర గ్రామాల్లో ముస్లింలు పీర్లతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

తోట్లవల్లూరు: ఐలూరు మసీదు వద్ద మొహర్రం సందర్భంగా ముస్లిం యువకులు చెస్ట్ బీటింగ్ చేశారు. గ్రామంలోని ప్రధాన వీధుల వెంట పీర్ల ఊరేగింపును వైభవంగా చేశారు. పెద్దలు షేక్ జబ్బార్, అమీర్‌ఖాన్, షేక్ హమీద్, రషీద్, షేక్ లతీఫ్ పర్యవేక్షించారు.

టీడీపీ సీనియర్ నాయకుడు
నాదెళ్ల వెంకట్రామయ్యకు ఘన నివాళి

మోపిదేవి, జూలై 17: పెదప్రోలు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నాదెళ్ల వెంకట్రామయ్య అకాల మరణం పార్టీకి, గ్రామానికి తీరనిలోటని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన వెంకట్రామయ్య భౌతికకాయానికి పెదప్రోలులోని ఇంటి వద్ద పూలమాల వేసి మండలి నివాళులర్పించారు. వెంకట్రామయ్య సతీమణి రమాదేవి సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామాభివృద్ధికి వారిరువురు ఎనలేని కృషి చేశారన్నారు. ఇటీవల ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయానికి వెంకట్రామయ్య చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నడకదుటి జనార్దనరావు, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు, పార్టీ నాయకులు నాదెళ్ల శరత్‌చంద్రబాబు, పరుచూరి అంజయ్య, కొల్లి మురళీకృష్ణ పాల్గొన్నారు.



వెంకట్రామయ్య భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మండలి బుద్ధప్రసాద్

విమర్శలు మానుకో

● సింహాద్రి రమేశ్‌కు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచన

అవనిగడ్డ, జూలై 17: మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు విమర్శలు, ఆరోపణలు మాని ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే అధికారులకు ఫిర్యాదు చేసి పట్టించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. ఐదేళ్లుగా నియోజకవర్గంలో విచ్చలవిడిగా జరిగిన దోపిడీని, అనైతిక కార్యక్రమాలను ఒక్క రోజులో అరికట్టలేమని, గతంలో చట్టవ్యతిరేక కార్యక్రమాలను చూసీచూడనట్లు వ్యవహరించిన అధికారుల్లో మార్పు రావాలని ఆయన అన్నారు. నియోజకవర్గంలో అసాంఘిక కార్యక్రమాలు, సహజ వనరుల దోపిడీని అరికట్టడమే ధ్యేయమన్నారు.

పంటకాలువలో తూటుకాడ, గుర్రపు డెక్క తొలగింపు

అవనిగడ్డ రూరల్, జూలై 17: కేఈబీ కెనాల్ నుంచి దిగువ ప్రాంతాలకు సాగునీరు విడుదల చేయడంతో పంటకాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం, గుర్రపు డెక్క, తూటుకాడను బుధవారం లస్కర్ల ఆధ్వర్యంలో తొలగించారు. దీంతో దిగువ ప్రాంతాలకు సాగునీరు సక్రమంగా పారుదల అవుతుంది.

దేవతలు ఎందరున్నా భగవత్‌తత్వం ఒక్కటే

● ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

మచిలీపట్నం టౌన్, జూలై 17: దేవతలను ఎన్ని రూపాల్లో పూజించినా భగవత్‌తత్వం ఒకటేనని, పంచాయతన పూజతో భగవత్ కటాక్షం దొరుకుతుందని ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. సుల్తానగరంలో ఓ ఫంక్షన్ హాలులో బుధవారం చాగంటి కోటేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కోటేశ్వరరావును రామాంజనేయ బృందంతో పాటు మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, యెండూరి సురేష్, మోటమర్రి బాబాప్రసాద్, మద్దుల గిరీష్ సత్కరించారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో వేలాదిగా ప్రజలు పాల్గొన్నారు. కూచిపూడి నాట్య ప్రదర్శనలు, భక్తి సంగీతం ప్రేక్షకులను అలరించాయి.

మచిలీపట్నంలోని దేవాలయాలకు చారిత్రక ప్రాధాన్యం

మచిలీపట్నంలో ఉన్న దేవాలయాలకు ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉందని ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. బుధవారం నిజాంపేటలోని బొబ్బిలి వేణుగోపాలస్వామి దేవాలయాన్ని, కోదండ రామస్వామి దేవాలయాన్ని, చిలకలపూడిలోని పాండురంగస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఆలయ నిర్వాహకులు, కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.



బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయంలో చాగంటి కోటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న దేవాలయ కమిటీ

మనిషికి మనసే ప్రధానం

గుడ్లవల్లేరు, జూలై 17: "మనిషికి మనసే ప్రధానం. మనసులో ఏ మలినం లేకుండా ఉండాలి. మానవ సంబంధాలు కాదు మాధవ సంబంధాలుండాలి. వేదం అంటేనే సైన్స్, సైన్స్ అంటేనే వేదం. ఈ రెండూ ప్రపంచానికి అవసరమే. అది గుర్తెరిగి ప్రజలు మసలుకోవాలి" అని ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా గుడివాడకు చెందిన కె.నాగరాజు, లక్ష్మీకుమారి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన గోవిందాష్టకం అనే అంశంపై గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో గరికపాటి నరసింహారావు ప్రవచనాలు చెప్పారు. గరికపాటిని నిర్వాహకులు సత్కరించారు. శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, గుడ్లవల్లేరు సిద్ధేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కొసరాజు వెంకటాద్రి (పెదబాబు), మురళీ కృష్ణమాచార్యులు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్, యాజమాన్య సలహాదారు పొట్లూరి రవీంద్రబాబు, గుత్తికొండ సుభాష్‌చంద్రబోస్, అన్నే ప్రసాదరావు, ఎ.వీరభద్రరావు, బొప్పన శ్రీను పాల్గొన్నారు.



ప్రవచనం చెబుతున్న గరికపాటి నరసింహారావు

మర్యాదపూర్వకంగా..

పామర్రు, జూలై 17: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హైదరాబాద్‌లోని ఆయన ఇంటి వద్ద బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చేందుకు మంద కృష్ణమాదిగ మద్దతు ఇవ్వడం, పామర్రు ఎమ్మెల్యేగా తన విజయానికి దోహదపడినందుకు ఆయనను సత్కరించారు. కుమార్‌రాజాను కృష్ణమాదిగ అభినందించారు. టీడీపీ నాయకుడు చాట్ల రమేష్ పాల్గొన్నారు.



మంద కృష్ణమాదిగకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించండి

● ప్రజలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచన

గుడివాడ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. బుధవారం ప్రజావేదికలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డెంగ్యూ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దానిని తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. ప్రజలందరూ చైతన్యవంతులై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. కొత్త నీరు వచ్చిందని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని ప్రజలకు సూచించారు.

కాల్వల పూడికతీతకు
విక్కుర్తి ఆర్థిక సాయం

నాగాయలంక, జూలై 17: మూడేళ్లుగా సాగునీటి కోసం మండలంలోని తీర గ్రామాల రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ పంట కాల్వ పూడికతీత పనులకు ఆర్థిక సాయం చేశారు. బుధవారం పెదపాలెం రెగ్యులేటరీ నుంచి సొర్లగొంది వరకు 8 కిలోమీటర్ల పొడవున పూడికతీత పనులను ఆయన ప్రారంభించారు. నాలుగు యంత్రాలు వినియోగించి పంట కాలువలో రెండు గజాల మేర పూడిక తీస్తున్నారు. కార్యక్రమంలో విక్కుర్తి రాంబాబు, సొర్లగొంది, పర్రచివర, భోగాదివారిదిబ్బ ప్రాంత రైతులు పాల్గొన్నారు.

శివరామకృష్ణ క్షేత్ర నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కోడూరు, జూలై 17: కోడూరులో పునర్నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి ఉల్లిపాలెం గ్రామానికి చెందిన గుడిసేవ సూర్యనారాయణ కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు అన్నం వెంకటసుబ్బారావు, జూపూడి సుభాష్ చంద్రబోస్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో బూరగడ్డ హరినాథ్ బాబు, బడే భావన్నారాయణ, అన్నం శివరామకృష్ణ, ఉల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు ఆదర్శనీయం

● లయన్స్ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ శ్రీశాంతి

పామర్రు, జూలై 17: సమాజానికి లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని లయన్స్ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ దామెర్ల శ్రీశాంతి అన్నారు. లయన్స్ క్లబ్ భవనంలో బుధవారం పామర్రు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 45 ఏళ్లుగా పామర్రు లయన్స్ క్లబ్ ద్వారా నిర్విరామంగా సమాజానికి సేవలందించడం అభినందనీయమన్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు నవులూరి వీరవెంకయ్యబాబు, ఎం.మధుసూదనరావుతో ప్రమాణస్వీకారం చేయించారు. వైద్యుడు ధర్మావీర్‌తోపాటు, రామదాసుకు నూతన సభ్యత్వం కల్పించారు. మల్టిపుల్ జిల్లా జీఎస్టీ కో-ఆర్డినేటర్ మూల్పూరి ఉపేంద్ర, కౌన్సిల్ చైర్మన్ ఎం.ఉపేంద్ర, పామర్రు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ టీవీ అప్పారావు, మాజీ అధ్యక్షుడు బొగ్గవరపు జాలయ్య, తోట రమేష్, బైసాని నాగేశ్వరరావు, కె.చంద్రశేఖర్, ట్రెజరర్ డాక్టర్ విక్టర్‌పాల్, పెరుమాళ్ల రాధాకృష్ణ పాల్గొన్నారు. ఐదుగురు చిరు వ్యాపారులకు వర్షాకాలం ఇబ్బందిపడకుండా గొడుగులను పంపిణీ చేశారు.

వృద్ధాశ్రమ నిర్మాణానికి విరాళం, అన్నదానం

చల్లపల్లి, జూలై 17: సీయోను వృద్ధాశ్రమ నిర్మాణానికి లయన్స్‌క్లబ్ ప్రముఖుడు కొల్లిపర నాగపోతురాజు(మధు) విరాళం అందించారు. మధు భార్య కొల్లిపర శివపార్వతి జయంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం చేసి ఆశ్రమ నిర్మాణానికి నిర్వాహకుడు శీలం భాస్కరరావుకు రూ.10వేల 116 విరాళం అందించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాయపాటి రాధాకృష్ణ, కస్తూరి వెంకట వరప్రసాద్, నర్రా సాయిబాబు, అన్నవరపు పాండురంగారావు, తగిరిశ సాంబశివరావు, కొక్కిలిగడ్డ మణిప్రభాకరరావు, వరదా హరిగోపాల్, ఉప్పల సాంబశివరావు, దోనేపూడి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. పార్వతమ్మతోటలోని ఆదరణ వృద్ధాశ్రమంలోనూ వృద్ధులకు అన్నదానం చేశారు.

మెరకగౌడపాలెంలో ముళ్ల చెట్ల తొలగింపు

కోడూరు, జూలై 17: కోడూరు పంచాయతీ పరిధిలోని మెరకగౌడపాలెం వంతెన సెంటర్ నుంచి ద్వారకాసెంటర్ వరకు రోడ్డుకిరువైపులా దట్టంగా పెరిగిన ముళ్లచెట్లు, కొమ్మలను యంత్రం సాయంతో తొలగించే కార్యక్రమానికి జనసేన, టీడీపీ మండలం నాయకులు బుధవారం శ్రీకారం చుట్టారు. జనసేన పార్టీ సీనియర్ నాయకుడు ఉల్లి శేషగిరి, యువ నాయకుడు బచ్చు వెంకటేష్, టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముద్దినేని చంద్రరావు, కోట రాంబాబు, బచ్చు వెంకటేష్ ఫ్రెండ్ సర్కిల్ పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు
విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపు

అవనిగడ్డ, జూలై 17: ఈనెల 18 నుంచి 28వరకు నిర్వహించనున్న జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. అవనిగడ్డ నియోజకవర్గం నుంచి అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసి మరోసారి జిల్లాలో నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలపాలని సూచించారు.

పెడన రూరల్: జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కోసం నియోజకవర్గం నుంచి 50మంది వలంటీర్లను నియమించామని పెడన నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పంచకర్ల సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రెన్యువల్స్‌తోపాటు కొత్త సభ్యత్వాలు నమోదుచేయాలని క్రియాశీలక వలంటీర్లకు ఆయన సూచించారు.

పామర్రు: నియోజవర్గంలో ఈనెల 18 నుంచి 28వరకు నిర్వహించనున్న జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదుపై ఆ పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ పట్టణంలో బుధవారం విస్తృతప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కూనపరెడ్డి సుబ్బారావు, నాయకులు అంబటి రాజ్యలక్ష్మి, కాకి ఝాన్సీ, మేరుగ సురేష్ పాల్గొన్నారు.

యంత్రాల ద్వారా సిల్టు తొలగింపు

మచిలీపట్నం టౌన్, జూలై 17: భారీ వర్షాలకు మచిలీపట్నం ముంపునకు గురవుతోందని బుధవారం నగరంలోని పల్లపు ప్రాంతాలు, స్లమ్ ఏరియాల్లో డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్టును యంత్రాలను వినియోగించి తొలగించారు. సిల్టు తొలగింపు పనులను కమిషనర్ బాపిరాజు పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఘంటసాల, జూలై 17: దాలిపర్రు పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ, ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన చొప్పర వెంకటేశ్వరరావు భార్య రాజ్యలక్ష్మికి రూ.46 వేలను బుధవారం అందించామని ఈవోపీఆర్డీ గుత్తికొండ కిషోర్ తెలిపారు. మండల పరిషత్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులంతా కలిసి రూ.46 వేలను వెంకటేశ్వరరావు కుటుంబానికి అండగా నిలిచేందుకు సేకరించామని ఆయన తెలిపారు. సర్పంచ్ డోకిపర్తి శాంతకుమారి, పంచాయతీ కార్యదర్శులు బోలెం అర్జునరావు, షట్టి రాంబాబు, చావల కాంతారావు, డిజిటల్ అసిస్టెంట్ తేజ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.